

శాకంబరీగా దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

శాకంబరీ దేవీ.. పాహిమామ్..

- సంపూర్ణ శాకంబరీ అలంకరణలో భద్రకాళి
- ఆలయానికి పోటెత్తిన భక్త జనం, కిక్కిరిసిన క్యూలైన్లు

7

16 రోజుల పాటు విశేష అలంకరణ, పూజలు, హోమాలతో సాగిన భద్రకాళి అమ్మవారు.. గురువారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భద్రకాళి అమ్మవారిని 15వేల కిలోల కూరగాయలతో అలంకరించారు. 12 మంది అర్చకులు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అమ్మవారిని అలంకరించారు. కరువు కాటకాలు, బాధలు, అనారోగ్యాల నుంచి అనుగ్రహించి ఆశీర్వదించు అమ్మా.. అంటూ పూజా ఆరాధనలు నిర్వహించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వచ్చే యేడు శాకంబరీ వరకు చల్లగా చూడమంటూ వేలాది మంది భక్తులు తల్లిని దర్శించుకొని వేడుకున్నారు. - ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

8



వెన్నారంలో ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న లెనిన్‌వత్సల్ టొప్పొ



ఢీ అంటే ఢీ

మానుకోట డీసీసీ పీఠం కోసం తీవ్ర పోటీ

- ఈ సారి ఓసీకి దీటుగా బీసీ, ఎస్సీలు
- గాడ్‌ఫాదర్‌లను నమ్ముకుని యత్నాలు
- ఈ నెలలోనే అధ్యక్షుడి నియామకం

మహబూబాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పీఠం కోసం ఢీ.. అంటే.. ఢీ అంటూ పోటీ తీవ్రంగా కన్పిస్తోంది. ఈ నెల చివర్లోగా డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తి చేయడానికి అధిష్టానం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మానుకోట పీఠం కోసం పోటాపోటీగా ఓసీలతో పాటు బీసీ, ఎస్సీలు తాము నమ్ముకున్న నేతల వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ జిల్లా ఏర్పాటు నుంచి డీసీసీ అధ్యక్షుడిగా దివంగత సీనియర్ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్ధన్‌రెడ్డి తనయుడు భరత్‌చందర్‌రెడ్డి కొనసాగుతూ.. వస్తున్నారు.

వాస్తవానికి ఈ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అన్నీ తానై నడిపిస్తూ వస్తున్న ఆయనకు పోటీగా ఎవరూ ఉండరని భావిస్తున్న క్రమంలో ఈ సారి ఎవరికి వారే తామంటే తామేనంటూ డీసీసీ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడడం విశేషం. ఆది నుంచి ఆధిపత్య రాజకీయాలతో సింబల్ ఓటింగ్ బలం ఉన్నప్పటికి అప్పుడప్పుడు ఓటమి చవిచూస్తూ వస్తున్న కాంగ్రెస్ పార్టీలో స్వరాష్ట్రం సిద్ధించిన దశాబ్దకాలం అనంతరం మళ్లీ అధికారంలోకి రావడంతో యథా ఆధిపత్య పోరు నివురుగప్పిన నిప్పులా రాజుకుంది. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మొదట్నుంచి జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతూ.. వస్తున్నారు. ప్రస్తుతం తిరిగి ఆయన్నే డీసీసీ అధ్యక్ష పీఠం కూర్చోబెట్టాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ఒకవేళ అంతకు మించి అత్యున్నత ప్రాతినిధ్య పదవి ఆయనకు లభిస్తే తనకు ఇంతకాలం వెన్నంటి నడిచిన వారిలో ఎవరికో ఒకరికి ఈ కుర్చీని అందించాలని యోచనలో ఉన్నారు. అందుకే కాబోలు రెడ్డి వర్గీయులు చాలా మంది అందులోనూ భరత్‌చందర్‌రెడ్డి ఫాలోవర్సే క్యూ కడుతున్నట్లు సమాచారం.

తొలిసారి బీసీ, ఎస్సీల పోటాపోటీ..

ఉమ్మడి వరంగల్ జిల్లా కాలం నుంచి మహబూబాబాద్ ప్రాంతంలో రెడ్డి వర్గీయులే ఆధిపత్యం కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీలో మానుకోట జిల్లా ఆవిర్భావ అనంతరం తొలిసారిగా బీసీ, ఎస్సీలు డీసీసీ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడుతున్నారు. ఇందులోనూ గత అసెంబ్లీ ఎన్నికల నుంచి మహబూబాబాద్ నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఆపాదించుకున్న బీసీ నాయకుడు ఒకరు ఎలాగైనా ఈ సారి డీసీసీ అధ్యక్ష పీఠం అధిష్టించాలని తన గాడ్‌ఫాదర్ ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తాజాగా ఇదే నియోజకవర్గంలోని సోమ్లతండా, కేసముద్రంలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఐదుగురు మంత్రుల పర్యటన, బహిరంగ సభల సందర్భంగా ఈ బీసీ నేత సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి బహిరంగంగానే పనిచేశారు.

సోమ్లతండాలో వందకోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపనలు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా.. జన సమీకరణ బాధ్యతలన్ని ఆయనే చూసుకున్నారు. కేసముద్రంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, సభలకు మాత్రం వేం నరేందర్‌రెడ్డి అనుచరులే పూర్తిగా జన సమీకరణకు నడుం బిగించారు. ఈ సభకు మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన బీసీ నేత జన సమీకరణ చేయడం వెనుక డీసీసీ అధ్యక్ష పీఠంపై దృష్టి ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. ఇందుకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆశీస్సులు కూడా లభించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎస్సీ నేతల్లో తామేం తక్కువకాదంటూ..

గిరిజన ఆధిపత్య మహబూబాబాద్ జిల్లాలో ఎంపీ, పూర్తిస్థాయి అసెంబ్లీ నియోజకవర్గాలైన మానుకోట, డోర్నకల్‌తో పాటు రెండేసి మండలాల ప్రాతినిధ్య ఇల్లందు, ములుగు నియోజకవర్గాలకు ఎస్టీలకు రిజర్వు అయి ఉండగా పాలకుర్తి మాత్రం జనరల్ స్థానంలో ఉంది. మొత్తానికి ఎస్టీల ప్రాబల్య ప్రాతినిధ్యంలోనే ఈ జిల్లాలో డీసీసీ స్థానం మాత్రం ఓసీ, లేదా బీసీ, ఎస్సీలకు అవకాశం లభిస్తుందని కోణంలో ఎస్సీ నేతలు తామేం తక్కువ కాదంటూ ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. నెల్లికుదురు, గూడూరు మండలాలకు చెందిన ఎస్సీ ముఖ్యనేతలిద్దరూ అవకాశం లభిస్తే డీసీసీ అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించాలని తమ గాడ్‌ఫాదర్‌ల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందుతోంది.

తాజాగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఈ నెల 15 కల్లా డీసీసీల ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో డీసీసీలో స్థానం కోసం ఆశావహులైన ఓసీ, బీసీ, ఎస్సీలు తమతమ నాయకుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క డీసీసీ కమిటీల ఏర్పాటు పూర్తికాగానే డీసీసీ అధ్యక్షుల నియామకం జరుగనుండడంతో ఈలోగానే ముఖ్యనేతల ఆశీస్సులు పొందేందుకు ఓసీలతో పాటు బీసీ, ఎస్సీలు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల వద్ద తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.


పెండింగ్ కేసుల పరిష్కారానికి సహకరించాలి

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల పరిష్కారానికి సహకరించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలంటే జైల్లో ఉన్న ఖైదీలను కోర్టులో సకాలంలో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్ వారెంట్లు త్వరగా క్లియర్ చేయాలని, సాక్షులను సరైన సమయంలో హాజరు పర్చాలని, విచారణ అధికారులు తమ విచారణను త్వరగా పూర్తి చేసి కోర్టుకు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ, సీనియర్ సివిల్ జడ్జి శాలిని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరవపల్లి కృష్ణతేజ్, తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జీ ధీరజ్‌కుమార్, మానుకోట, తొర్రూరు డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిషోర్, జిల్లా కోర్టు పరిపాలన అధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



'ఆత్మీయ భరోసా' అందేనా..?!

- భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేల ఆర్థికసాయం
- గత జనవరిలో అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 67,136మంది లబ్ధిదారుల ఎంపిక
- 74 పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో తొలివిడతలో రూ.6వేలు జమ
- ఆరు నెలలైనా మిగతా లబ్ధిదారులకు అందని భరోసా
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయంపై ఎదురుచూపులు
- ప్రభుత్వ ప్రకటన లేకపోవటంతో ఆందోళనలో నిరుపేదలు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. గుంట భూమిలేని నిరుపేదలు.. ప్రభుత్వం అందించే ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. ఏటా రెండు విడతల్లో నిరుపేదలకు రూ.12వేల ఆర్థికసాయాన్ని అందించేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తీసుకువచ్చింది. జనవరి 26వ తేదీన ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. తొలుత ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా తీసుకుని, ఎంపిక చేసిన లబ్ధిదారులకు తొలి విడత రూ.6వేలను వారి ఖాతాల్లో జమ చేశా రు. అయితే ఆరు నెలలు కావస్తున్నప్పటికీ మిగతా లబ్ధిదారులకు తొలివిడత ఆత్మీయ భరోసా సాయం అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభు త్వం అత్మీయ భరోసా సాయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో సాయం అందేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఆత్మీయ భరోసాకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు

జిల్లా	జాబ్ కార్డులు	కూలీలు	ఆత్మీయ భరోసా లబ్ధిదారులు
వరంగల్	1,20,127	2,39,463	10,543
హనుమకొండ	86,043	1,70,022	10,672
జనగామ	1,17,729	2,31,005	9,102
మహబూబాబాద్	2,19,509	4,61,007	21,673
భూపాలపల్లి	1,09,960	2,41,994	7,748
ములుగు	86,246	1,81,761	7,181
మొత్తం	7,39,609	15,25,252	67,136

భూమి లేని పేదలకు..

రైతులకు ఏటా ఎకరాకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని రైతు భరోసా ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఇదే తరహాలో భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా అందిస్తామని ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హుల ఎంపిక కోసం ప్రభుత్వం అనేక నియమాలు పెట్టింది. ప్రధానంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద కనీసం 20 పని దినాలైనా పూర్తి చేసి ఉండాలి. గుంట భూమి కూడా లేని నిరుపేదలను అర్హులుగా నిర్ణయించింది. కుటుంబంలో యాజమానిగా ఎవరు ఉన్నప్పటికీ, ఆ కుటుంబంలోని మహిళను లబ్ధిదారుగా ప్రభుత్వం గుర్తించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మొత్తం 7,39,609 జాబ్‌కార్డులు ఉండగా, 1525,252 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 67,136మంది

(మిగతా 8వ పేజీలో...)

పారిశుధ్యం అస్తవ్యస్తం

- డోర్నకల్ గాంధీసెంటర్ వద్ద చెత్తకవర్లతో యువకుడి నిరసన



డోర్నకల్ గాంధీసెంటర్‌లో చెత్తకవర్లను పక్కన పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న యువకుడు కుందోజు లవన్

డోర్నకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపిస్తూ.. డోర్నకల్‌కు చెందిన యువకుడు కుందోజు లవన్ చెత్తకవర్లను పక్కన పెట్టుకుని గాంధీసెంటర్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా లవన్ మాట్లాడుతూ డోర్నకల్ పట్టణంలో గత 10 రోజులుగా మునిసిపల్ చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని, దీంతో ఎక్కడికక్కడే వీధుల్లో పారిశుధ్యం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని చెప్పారు. అధికారులకు విన్నవించినప్పటికి వారు నిర్లక్ష్యంగా వ్యవహిస్తుండడంతో తాను నిరసనకు దిగినట్లు చెప్పారు. నిరసన చేస్తున్న లవన్‌కు స్థానికులు మద్దతు పలికారు.

రైతువేదిక వద్ద తల్లిని వదిలేసిన కుమారులు

గూడూరు మండలం భూపతిపేటలో ఘటన

6

మన జీవితాలకు మార్గదర్శకుడు గురువు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



బీజేపీ ఆఫీస్‌లో గురువు సూర్యప్రకాశ్‌లోయాను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురువు మన జీవితాలకు మార్గదర్శకుడని, జ్ఞానాన్ని ప్రసాదించే దైవ సమానులని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం యోగా గురువు సూర్యప్రకాశ్‌లోయా, కరాటే గురువు రాంబాబునాయక్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు జ్ఞానం, విలువలు, సిద్ధాంతాలను నేర్పేది గురువులనేనని చెప్పారు. పాఠాలు నేర్పే వారు కాదు.. జీవితాలను మార్చే వారు కూడా గురువులనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, ఓర్సు పద్మావతి, పల్లె సందీప్, సరోజ, సరిత, సందీప్, శ్యాం, భరత్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్‌ప్లాప్ అయిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నిల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడపకూ వివరించాలన్నారు. చిన్నవంగర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పాకనాటి రఘువీరారెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఉప్పరగూడెం, అవుతాపురం గ్రామాల్లో పలువురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి రామచంద్రయ్య, మండల మాజీ అధ్యక్షుడు యాదగిరిరావు, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, సమ్మయ్య, వెంకన్న, జ్ఞానేశ్వరాచారి, రవి, వెంట్రామయ్య, శ్రీనివాస్, పటేల్, భాస్కర్, రాజేందర్, గంగాధర్, కుమార్, రఘు, హరీష్, వేణు, సతీష్, అనిల్, మహేష్, శేఖర్, అనుదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో బాలికను గర్భవతి చేసి..

● గర్భవిచ్ఛిత్తికి మాత్రలు.. తీవ్ర రక్తస్రావం ● యువకుడిపై పోక్సో కేసు

పాలకుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో కొంతకాలంగా బాలికపై యువకుడు అత్యాచారం చేయడంతో.. ఆమె గర్భం దాల్చిగ, గర్భ విచ్ఛిత్తికి పాల్పడిన ఘటన జనగామ జిల్లాలోని పాలకుర్తి మండల పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం.

పాలకుర్తి మండల పరిధికి చెందిన 16ఏళ్ల బాలికకు తల్లి చనిపోగా, తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. దీంతో సదరు బాలిక అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఈక్రమంలో పాలకుర్తి మండలం తీగారంనకు చెందిన యువకుడు దండెంపల్లి ప్రణయ్ వరికోత మిషన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. బంధువుల ఇంటికి వచ్చినప్పుడు ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి బాలికను లొంగదీసుకున్నాడు. కొంతకాలంగా బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. ప్రస్తుతం బాలిక ఆరునెలల గర్భవతి అని తెలుసుకున్న ప్రణయ్ గర్భ విచ్ఛిత్తికి టాబ్లెట్లు ఇచ్చాడు. ఇంటికి వెళ్లాక బాలిక గోలీలు వేసుకోగా తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను నిలదీయగా అసలు విషయం బయటపడింది. ప్రస్తుతం బాలికను హన్మకొండలోని ఓ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు

డోర్నకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) :డోర్నకల్ మండలం బూరుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంటలో అనుమతులు లేకుండ అక్రమంగా మట్టి తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగుపాడుకు చెందిన పాపిరెడ్డి, సురేష్, సత్యం, సైదులు అక్రమంగా గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట నుంచి మట్టితరలిస్తున్నారని ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరి సాగులో వెదజల్లే పద్ధతి

● విత్తనాలు, నాటు ఖర్చు తగ్గుతుందంటున్న రైతాంగం

● వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం

కాటారం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ఓ వైపు..వరి నాట్లు, ఎరువులు, ఇతర పనులకు ఖర్చులు భారీగా పెరగడం మరో వైపు. వెరసి వీలైనంత మేర సాగు ఖర్చులను తగ్గించుకోవాలని రైతులు భావిస్తున్నారు.

పెట్టుబడి కోసం అధికంగా డబ్బులు వెచ్చించినా మద్దతు ధరలు కూడా అందని పరిస్థితిలో సరైన దిగుబడులు రాకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటామని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పద్ధతుల కోసం సిద్ధమవుతున్నారు. మండలంలో గత ఏడాది వానాకాలంలో సుమారు 13 వేల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుత సీజన్‌లో చెరువులు, కుంటలు, బోరుబావులు తదితర జలవనరుల ద్వారా వరి సాగు చేస్తున్నారు. ఈ వానాకాలంలోనూ వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండితే 13 వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పలువురు రైతులు బోర్ల కింద నారుమళ్లను ఏర్పాటు చేసి నాట్లు వేస్తుండగా, కొందరు ఈ పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. వర్షాలు సరిగా కురవక ఇప్పటికీ చెరువులు, కుంటలు నిండని పరిస్థితి ఉండటంతో మండలంలోని పలు గ్రామాల పరిధిలో కొందరు రైతులు వడ్లు వెదజల్లే పద్ధతి (బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)ని అవలంబిస్తున్నారు. కొందరు రైతులు పొడి వడ్లను దుక్కిలో చల్లుతుండగా మరికొందరు రైతులు విత్తనాలను నీటిలో నానబెట్టి మండె కట్టి కొద్దిగా మొలకెత్తిన అనంతరం మొలకలను పొలంలో చల్లుతున్నారు. నాటు కోసం ఎకరాకు 25-30 కిలోల వడ్లు విత్తనాలుగా తెచ్చే రైతులు వెదజల్లే పద్ధతిలో 10-15 కిలోల వడ్లు మాత్రమే వినియోగిస్తున్నారు.

నాటుకు ఎకరాకు రూ.4 వేలు నుంచి రూ. 5 వేలు వరకు కూలీలకు, పొలం దున్నడానికి మరో రూ.5 వేలు ఖర్చయ్యే పరిస్థితి ఉండగా ప్రస్తుతం వెదజల్లే పద్ధతి రూ.2,500-3000తోనే సరిపోతుందని రైతులు అంటున్నారు. దీంతో ఎకరాకు రూ.5,000-6,000 వరకు నాటు, విత్తనాలు, దున్నే ఖర్చు మిగిలే అవకాశం ఉండటంతో ఆ మేరకు దిగుబడులు పెరిగినట్లేనని అన్నదాతలు అంటున్నారు. కాటారం మండలంలో ఈ సీజన్ వరి సాగు సుమారు 20శాతం వెదజల్లే పద్ధతితోనే అవుతుందని అంచనా. చింతకాని, పోతులవాయి, ఇబ్రహీంపల్లి తదితర గ్రామాల పరిధిలో ఇప్పటికే సుమారు 400 ఎకరాల్లో పొడి వడ్లను అలకగా మొలకెత్తి వరి ఏపుగా ఎదుగుతోంది. ఈ బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి విజయవంతమైతే మండల రైతులకు రూ.1.50 కోట్లు ఆదా అయ్యే పరిస్థితి ఉంది. వెదజల్లే పద్ధతితో పంట కాలవ్యవధి, కొంత పెట్టుబడి ఖర్చు తగ్గే ప్రభావం ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు.



వడ్లను పొలంలో చల్లుతున్న రైతులు, పోతులవాయి చెరువు కింది పొలాల్లో మొలకెత్తిన వరి

పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ద్వారా వరద నీరు భారీగా వచ్చి త్రివేణి సంగమం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. సరస్వతీ పుష్కరాల సందర్భంగా జ్ఞానసరస్వతీ ఘాట్ వద్ద మెట్లపై ఏర్పాటు చేసిన జ్ఞానతీర్థం చుట్టూ వరదనీరు చేరింది. ఈప్రవాహం ఇలానే కొనసాగితే ఘాట్ వద్ద ఉన్న సరస్వతీ అమ్మవారి పాదాలను ప్రాణహిత, గోదావరి నదులు అభిషేకించనున్నాయి. గురువారం కాళేశ్వరం వద్ద గోదావరి నది 10.65మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.



వాజేడు మండలం పూసూరు-ముళ్లకట్ట వంతెన వద్ద గోదావరి వరద ప్రవాహం

తుపాకులగూడెం వద్ద..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న గోదావరికి వరద ప్రవాహం పెరిగి ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వరద వచ్చి గోదావరిలో కలిసి ప్రవహిస్తుండటంతో గోదావరి ఉధృతి భారీగా పెరిగింది. సమ్మక్కసాగర్ బ్యారేజీలోకి ఎగువ నుంచి 5,10,470 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అంతే మొత్తంలో వచ్చిన వరద నీళ్లను వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. గురువారం బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.429 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 80.30 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద..

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సమ్మక్క బ్యారేజీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరికి వరద తాకిడి భారీగా చేరుకుంది. దీంతో పుష్కరఘాట్ వద్ద సాయంత్రం 5 గంటల వరకు 11.01మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. గోదావరి పెరుగుతుండడంతో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మరింతగా గోదావరి వరద తాకిడి పెరిగే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద

పేరూరు వద్ద..

వాజేడు (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు మండలంలో గోదావరి వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. పేరూరు సీడబ్ల్యూసీ కేంద్రం వద్ద గురువారం ఉదయం 8 గంటలకు గోదావరి నీటిమట్టం 13.41 మీటర్లు ఉండగా 9 గంటలకు 13.51 మీటర్లు, మధ్యాహ్నం 3 గంటలకు 14.02 మీటర్లు, 4 గంటలకు 14.08 మీటర్లు, 5 గంటలకు 14.120 మీటర్ల నీటి మట్టానికి చేరుకుని గోదావరి పెరుగుతోంది. ఎగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ అన్ని గేట్ల నుంచి నీటి విడుదల చేయడంతో మండలంలో గోదావరి పెరుగుతోంది. పూసూరు-ముళ్లకట్ట వంతెన వద్ద గోదావరికి కొత్తనీరు చేరి జలకళను సంతరించుకుంది. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు సూచించారు. జీపీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, వరదల వల్ల ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు.

విచారణ పేరుతో ఆగంతకుడి బెదిరింపు

జనగామ డాక్టర్‌కు ఫోన్ కాల్

సైబర్ నేరగాళ్లపై పోలీసులకు సమాచారం

జనగామ, జూలై 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. అమాయక ప్రజలే కాకుండా ఉన్నత విద్యావంతులను సైతం బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే క్రమంలో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు లక్ష్మీనారాయణనాయక్‌కు గురువారం ఇదే అనుభవం ఎదురైంది.

పహల్గామ్ ఉగ్రదాడి విచారణ పేరుతో ఆయనకు గురువారం మధ్యాహ్నం ఓ ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను పహల్గామ్ ఉగ్రదాడి ఘటన విచారణ అధికారి నంటూ గుర్తు తెలియని వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. పహల్గామ్ ఉగ్ర దాడితో మీకు సంబంధాలు ఉన్నాయం టూ బెదిరించాడు. తాను చెప్పిన అడ్రస్‌కు రావాలని లేదంటే తాను పంపే వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయాలని బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు. ఇది సైబర్ నేరగాళ్ల పని అని ముందే పసిగట్టిన డాక్టర్ తాను ఎక్కడికీ రాబోనని, ఏ వెబ్ సైట్‌లోనూ రిపోర్ట్ చేయనని తెగేసి చెప్పాడు. అవసరమైతే తన వివరాలను స్థానిక పోలీసులకు ఇస్తానని, వారి నుంచి తీసుకోవాలని చెప్పడంతో ఆగంతకుడు కాల్ కట్ చేసినట్లు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ తెలిపారు. అనంతరం జనగామ సీఐకి వాట్సాప్ ద్వారా ఆగంతకుడి కాల్ రికార్డ్‌ను పంపించినట్లు లక్ష్మీనారాయణనాయక్ తెలిపారు.

చైన్‌స్నాచింగ్

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

నిడిగొండలో ఘటన

రఘునాథపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉన్న గడ్డిని తొలగిస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బలవంతంగా లాక్కెళ్లిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండలో గురువారం చోటు చేసుకుంది. నిడిగొండకు చెందిన పెద్దగోని సుజాత వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు సమీపంలో ఉన్న తన ఇంటి ముందు ఏపుగా పెరిగిన గడ్డిని తొలగిస్తోంది. వరంగల్ నుంచి జనగామ వైపునకు మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా బైక్‌ను ఆపి సుజాత మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. గొలుసును లక్కెళ్లడంతో కింద పడిపోయిన సుజాతకు గాయాలయ్యాయి. దొంగ..దొంగ అని అరిచినా అప్పటికే వారు మోటారు సైకిల్‌పై పరారయ్యారు. చైన్ స్నాచింగ్ సమాచారం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తొర్రూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. గురువారం తొర్రూరులోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు నాగమల్లయ్య, రఫీ, వెంకటేశ్వర్లు, రంజిత్, చైతన్య పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలేవి?

● పట్టించుకోని వైద్యశాఖ అధికారులు

తొర్రూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో వరుస సంఘటనలు జరుగుతున్నా వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం రోజు తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన సంఘటనలో సంబంధిత ఆస్పత్రిని వైద్యశాఖ అధికారు లు కనీసం తనిఖీలు చేయకపోవడం, ఆస్పత్రి నిర్వాహకులు యథావిధిగా గురువారం ఆస్పత్రిని నిర్వహిస్తుండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. చనిపోయిన పేషంట్ బంధువులతో బేరసారాలు జరిపి వారిని అక్కడి నుంచి పంపిం చి సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టచెప్పడంలో ప్రైవేటు ఆస్పత్రులదే పైచేయి అయిందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా నామమాత్రపు తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పేద అమాయక రోగులను ఆసరా చేసుకుని లక్షలు దోపిడీ చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



యథావిధిగా నిర్వహిస్తున్న ఆస్పత్రి

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

తొర్రూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలు పాటించుకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు పంతం విజేందర్, స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయ రికార్డ్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించి మాట్లాడారు. తొర్రూరు డివిజన్ 7 మండలాల్లోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో లక్షలు దండుకుంటున్నాయన్నారు. ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తూ అర్హత లేని ఒరిస్సా, కేరళ రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులతో విద్యా బోధన చేయిస్తున్నారన్నారు. అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తేజ, చరణ్, సంతోష్, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

రైతువేదిక వద్ద తల్లిని వదిలేసిన కుమారులు

● గూడూరు మండలం భూపతిపేటలో ఘటన

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నవమాసాలు మోసి.. కని పెంచిన కన్న కుమారులు తల్లిపై కర్కశంగా వ్యవహరిస్తున్నారు. చిన్నతనంలో తమ కుమారులను కంటిపాపలవలె చూసుకున్న తల్లిని పోషించేస్థోమత లేక కన్న కుమారులే 75 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కుమారులు రైతువేదిక వద్ద వదిలేసి వెళ్లిన హృదయ విదారకర సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేటలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.

గూడూరు మండలం వెంగంపేట గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు బొడ్డు భద్రమ్మ-ముత్తయ్యకు కుమారులు వెంకన్న, సుధాకర్, రమేష్, యాకస్వామితో పాటు పద్మ, ఉపేంద్ర ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరికి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. కుమార్తెలకు కట్నకానుకలు ఇచ్చి వివాహం చేయగా, తమకున్న భూమిలో ఒక్కొక్క కుమారుడికి 30 గుంటల చొప్పున భూమి, ఇంటిస్థలం సైతం ఒక్కొక్కరికి 1.33 గజాల చొప్పున వారి పేర్లపై రాసి ఇచ్చింది. భద్రమ్మ భర్త ముత్తయ్య 20 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. ఆమె మాత్రం అరగుంట స్థలం ఉంచుకుని అందులో నివాసం ఏర్పాటు చేసుకుని కూలీనాలీ పను లు చేసుకుంటూ జీవిస్తోంది. వృత్తిరీత్యా కుమారులు, కుమార్తెలు వేర్వే రు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. తల్లి భద్రమ్మ వృద్ధాప్యం మీదపడడంతో ముగ్గురు కుమారులు, పెద్దకుమారుడి భార్య కలిసి నెల వంతులవారీగా పోషిస్తున్నారు. అయితే పెద్ద కుమారుడు వెంకన్న పదేళ్ల క్రితం మృతి చెందాడు. అయినప్పటికి వెంకన్న భార్య అనసూర్య తమవంతు వచ్చేసరికి నెల రోజులు భద్రమ్మను పోషిస్తూ వచ్చింది. చిన్నెల్లాపురంలో ఉండే యాకస్వామి వంతువారీగా నెలరోజులు పోషించిన తర్వాత చిన్నగూడూరు మండలం మంగోరిగూడెంలో ఉంటున్న తన అన్న భార్య అనసూర్య వద్దకు పంపాల్సి ఉంది. అయితే తనకు భర్త లేడని, ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఆమెను పోషించే స్థోమత తనకు లేదని చెప్పడంతో యాకస్వామి తన తల్లిని ఇంటికి తీసుకువెళ్లకుండా నిర్దాక్షిణంగా భూపతిపేట రైతువేదిక వద్ద వదిలిసి వెళ్లాడు.

ఈ విషయం తెలుసుకున్న భూపతిపేట మాజీ సర్పంచ్ భర్త ఆవుల అశోక్ వృద్ధురాలు భద్రమ్మ వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకుని భద్రమ్మ పెద్దకోడలు అనసూర్యకు ఫోన్‌చేసి మాట్లాడి ఆటోనుఏర్పాటు చేసి మంగోరిగూడెంకు పంపించారు. అక్కడ సైతం అనసూర్య భద్రమ్మను పోషించేందుకు నిరాకరించడంతో ఆటో డ్రైవర్ భూపతిపేట ఓ పంచర్ దుకాణం వద్ద వదిలేసి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్థులు ముగ్గురు కుమారులు, వారి భార్యలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆపై ముగ్గురు కోడళ్లు సులోచన, ఉపేంద్ర, నాగలక్ష్మి మరోసారి ఆటోలో అత్త భద్రమ్మను తీసుకుని పెద్దకోడలు ఇంటికి తీసుకువెళ్లారు.



రైతు వేదిక వద్ద ఉన్న వృద్ధురాలు భద్రమ్మ

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

పాలకుర్తిలో యువకుడి దుర్మరణం

మృతుడిది రాయపర్తి మండలం మైలారం

పాలకుర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారంనకు చెందిన గాడిపెల్లి రంజిత్(24) హైదరాబాద్‌లోని ఓ వైన్ షాపులో తన సోదరుడుతో పాటు పని చేస్తున్నాడు. సొంత పనిమీద పాలకుర్తి మీదుగా హైదరాబాద్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో జనగామ నుంచి పాలకుర్తికి రాగానే, బస్టాండ్ లోపలికి వెళ్తున్న ఆర్టీసీ బస్సును రంజిత్ బైక్ ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రంజిత్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి, సోదరుడు, చెల్లె ఉన్నారు.

మైలారంలో విషాదం

రాయపర్తి(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలారంలో విషాదం నెలకొంది. గాడిపెల్లి వెంకటయ్య, రజిత దంపతుల కుమారుడు గాడిపెల్లి రంజిత్ హైదరాబాద్‌లో బతుకు దెరువు కోసం వెళ్లి పనిచేస్తున్నాడు. తండ్రి ఐదేళ్ల కిందట మృతిచెందగా, తల్లి గ్రామంలోనే ఉంటోంది. తల్లి చెంతకు వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతి చెందిన రంజిత్



కాళేశ్వరంలో మొక్కలు నాటుతున్న ప్రభాకర్

వనమహోత్సవానికి సన్నద్ధం కావాలి

కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్

మహదేవపూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న వనమ హోత్సవానికి సన్నద్ధం కావాలని కాళేశ్వరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారె స్ట్ బి.ప్రభాకర్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆయన బుధవారం పర్యటించారు. వనమహోత్సవంపై మహదేవపూర్ ఎఫ్‌డీవో సందీప్‌తో కలిసి చర్చించారు. ఈసందర్భంగా కాళేశ్వరాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ముక్తివనాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2349	1521
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	3600	1575
కందులు	5989	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7510	5300
పసుపు (కాడి)	12259	9534
పసుపు (గోల)	10288	9700
తేజ ఏసీ	12500	11500
తేజ మిర్చి	11000	8500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	11500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఉపాధి పనుల్లో అతివలే అగ్రపథం

- పురుషుల కంటే ఎక్కువ హాజరు
- వ్యవసాయం కన్నా ప్రాధాన్యతనిస్తున్న మహిళలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళలు ఉపాధి హామీ పనుల్లో అగ్రపథంలో ఉన్నారు. పురుషులతో సమానంగా గడ్డపార, పార, తట్టతో పనులు చేస్తూ మిగతా మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సంవత్సరం పని దినాలను వినియోగించుకోవడంలో పురుషుల కంటే అతివలు ముందు వరుసలో ఉన్నారు.


దామెర మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

ఎక్కువ హాజరు

ఉమ్మడి జిల్లాలో మహిళా కూలీలు 4,54,123 మంది, పురుష కూలీలు 3,76,959 ఉండగా,వీరిలో 2,47,103మంది మహిళలు, 1,70,192 మంది పురుషులు పనులు చేశారు. మొత్తంగా 63,12,713 పని దినాలకు 37,23,340 మహిళలు, 24,89,373 పురుష కూలీలు పనులు చేశారు. దీంతో పురుషులకంటే మహిళలే సుమారు 12లక్షల పనిదినాలు ఎక్కువ పనులు చేసి రికార్డు సృష్టించారు. ఎండాకాలం సెలవులలో చదువుకునే యువతీ యువకులు కూడా చురుకుగా ఉపాధి హామీ పనుల్లో చేసి తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు కుటుంబ అవసరాలకు కూడా ఆర్థిక సహకారం అందించారు.

క్రమక్రమంగా పెరుగుదల

ఉపాధిహామీ పనుల మొదట్లో చెరువులు, కాలువ పూడికతీత పనులకు అధికంగా పురుషులే చేసేవారు. నైపుణ్యం లేని కూలీలకు పనులు అధికంగా దొరకడంతో క్రమక్రమంగా మహిళా కూలీల శాతం పెరిగింది. దీంతో వ్యవసాయ పనుల కంటే ఉపాధిహామీ పనులకే మహిళలు ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. పార, పలుగు పట్టి మట్టిని తవ్వుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేల స్వభావం ఎలా ఉన్నా ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. చెరువులు, కాలువల పూడికతీత, మట్టి రహదారుల నిర్మాణంలో పనులలో భాగస్వామ్యం అవుతున్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహిళలు మహిళా సంఘాల పొదుపు చేసుకుంటూ, ఆ పొదుపు ద్వారా వచ్చిన డబ్బుతో సంఘాలను బలోపేతంచేస్తూ ప్రభుత్వం ద్వారా వడ్డీలేని రుణాలు పొందుతున్నారు. ఈ డబ్బులతో పిల్లల చదువులకు కానీ, వైద్యానికి కానీ ఖర్చు చేస్తూ కుటుంబ బాధ్యతలో తమ వంతు సహాయం చేస్తున్నారు.

మహిళలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు..
మేన శ్రీను, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



మహిళలు ఉపాధి హామీ పనులకు ఉత్సాహంగా వస్తున్నారు. రోజు రోజుకూ పనిచేసే మహిళా కూలీల సంఖ్య పెరుగుతోంది. ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఎక్కువ కూలీలు పనులు చేయడానికి వస్తున్నారు. పురుషులకంటే మహిళలు ఉపాధి హామీ పనుల్లో నిమగ్నం కావడం మంచి పరిణామం. ఉపాధి పనుల ద్వారా వచ్చిన డబ్బులను మహిళలు తమ పిల్లల ఫీజులు, వైద్య ఖర్చుల కోసం ఉపయోగించుకుంటున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

వడ్డెపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎదుట 200 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమార స్వామి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంచెర్ల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత కరెన్సీపై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా మిథున్, జిల్లా నాయకులు శివరాజ్, శ్రావన్‌కుమార్ పాల్గొన్నారు.


దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


దేవాలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

శాకంబరీ.. పాహిమామ్..

- సంపూర్ణ శాకంబరీ అలంకరణలో భద్రకాళి
- ఆలయానికి పోటెత్తిన భక్త జనం, కిక్కిరిసిన క్యూలైన్లు

వరంగల్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో అమావాస్య నుంచి పౌర్ణమి వరకు కొనసాగిన శాకంబరీ ఉత్సవాల ముగింపు వేళ అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. నిండు పౌర్ణమి గడియల్లో అమ్మవారు తేజోవంతంగా శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైంది. రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. భక్తుల దర్శనానికి ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులతో కాయగూరలతో శాకంబరీ అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు సంతోషంతో దర్శనం చేసుకున్నారు. శాకంబరీ అలంకరణలోఉన్న భద్రకాళి అమ్మవారిని 50వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం.

అమ్మవారి సన్నిధిలో మంత్రి సురేఖ

శాకంబరీ అలంకరణ సందర్భంగా మంత్రి కొండా సురేఖ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ శివసుబ్రహ్మణ్యం, ఈవో శేషు భారతి, భద్రకాళి ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఆలయ ధర్మకర్తలు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను ఈవో, చైర్మన్ అందజేశారు.


అమ్మవారికి హారతి ఇస్తున్న దృశ్యం

పోలీసుల సేవలు

గతంలో ఎన్నడూలేని విధంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక కార్యాచరణతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ ఆదేశాలతో ప్రత్యేక క్యూలు, పార్కింగ్‌లు, దర్శనాలకు కేటగిరీల వారీగా లైన్లు ఏర్పాటు చేయడం, పెట్రోలింగ్ వాహనాలు, వీఐపీల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చూశారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బందితో సహా దాదాపు 250 మంది పోలీసు శాఖ అధికారులు సేవలందించారు.

ఉచిత ప్రసాద వితరణ

భద్రకాళి సేవా సమితి నిర్వాహకులు ఐతా గోపీనాథ్ నేతృత్వంలో శాకంబరీ వేడుకలకు తరలివచ్చిన భక్తులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు 6 క్వింటాళ్ల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. తాగునీరు, బాదం పాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ జరిగాయి. 8 రకాల ప్రసాదాలను భక్తులకు ఉచితంగా ఇచ్చారు.

తడబడుతున్న 'స్టెప్'!

- నామావశిష్టంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం
- ఒకటి, రెండు ట్రేడ్‌లకే పరిమితమైన శిక్షణ
- శిక్షణకు ముందుకు రాని యువత
- ఫీజు చెల్లించాల్సి రావడంతో వెనుకడుగు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించాలనే లక్ష్యంతో హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులో కాకతీయ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రభుత్వ ఉదాసీన, యువత అనాసక్తి మూలంగా నిరుపయోగంగా మారిపోతోంది. ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యం నీరుగారి పోతోంది. కేంద్రం ఉనికి క్రమంగా నామావశిష్టంగా మారుతోంది. యువజన సేవల విభాగం ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రమోషన్(స్టెప్) నిర్వహణలో ఈ కేంద్రం ఒకటి ఉందన్న విషయం చాలామంది నిరుద్యోగ యువతీ యువకులకు తెలియదు. తెలిసినా ఇందులో ఉపాధి శిక్షణ పొందేందుకు ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా డిమాండ్ ఉన్న స్వయం ఉపాధికి సంబంధించిన సరికొత్త ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం లేదు. ఈ కేంద్రం ఏర్పాటై పదేళ్లవుతున్నా ఇప్పటికీ సంప్రదాయ వృత్తుల్లోనే శిక్షణ ఇస్తుండడంతో నిరుద్యోగులు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఒకప్పుడు 21 ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చే ఈ కేంద్రంలో ప్రస్తుతం రెండింటిలోనే శిక్షణ ఇస్తున్నారు.

గతమెంతో ఘనకీర్తి

గతంలో యువజన సర్వీసుల శాఖ విడిగా ఉన్నప్పుడు యువత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేవారు. సబ్సిడీపై రుణాలిచ్చి స్వయం ఉపాధి కల్పించేవారు. కళాకారులకు పెద్దపీట వేసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఏడాదిలో రెండుసార్లు యూత్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రామ్(వైఈపీ) చేపట్టేవారు. నగదు ప్రోత్సాహకాలు అందించేవారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన యువత ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేవారు. యువజన సంఘాలను బలోపేతం చేయడానికి, వారికి స్వయం ఉపాధి కల్పించడానికి యువ చేతన పథకాన్ని ప్రారంభించారు. కానీ, ఈ పథకం నమోదు ప్రక్రియకే పరిమితమైంది. ఆ తర్వాత అమలుకు నోచుకోలేదు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటి సంరక్షించడం, కేరీర్ గైడెన్స్, జన చైతన్య వంటి కార్యక్రమాలు జరిగేవి. అవి ఇప్పుడు జరగడం లేదు. యువజన సేవల విభాగం ఆధీనంలోనే ఉండే స్టెప్ నిర్వహణలో ఏర్పాటైన వృత్తిశిక్షణ కేంద్రాలు ఎంతో విజయవంతంగా నడిచేవి. ఇందులో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లతో పాటు స్వయం ఉపాధి కల్పనకు 18-35 ఏళ్లలోపు యువతకు రాజీవ్ యువశక్తి పథకం కింద సబ్సిడీపై రూ.లక్ష వరకు రుణం మంజూరు చేసేవారు.



హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డులోని వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రం

కానీ ఇప్పుడు..

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్‌లో మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, మొబైల్ రిపేరింగ్, ఆర్ అండ్ ఏసీ వంటి కోర్సులను ప్రవేశపెట్టినా ఇందులో శిక్షణ తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరికి వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం శిక్షణా కేంద్రంలో ముగ్గురు శిక్షకులు ఉన్నారు. టైలరింగ్, కంప్యూటర్‌లో శిక్షణ కోసం నిరుద్యోగ యువతీ యువకులు వస్తున్నారు. 30 నుంచి 40 మందికి ప్రస్తుతం ఈ రెండు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

కళతప్పిన స్టెప్

తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2016లో జిల్లాల విభజన అనంతరం యువజన సర్వీసు శాఖను క్రీడా ప్రాధికారిక సంస్థలో విలీనం చేశారు. గతంలో ఉన్న సిబ్బందిలో మూడొంతులు తగ్గించారు. గతంలో కొనసాగిన పథకాలు ఒక్కొక్కటిగా రద్దయ్యాయి. దీంతో స్టెప్ కళావిహీనంగా మారింది. గతంలో ఈ కేంద్రంలో ఏ కోర్సులో అయినా ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు ఆయా కోర్సులకు రూ.1500 నుంచి రూ.3000 వరకు ఫీజు చెల్లించాలి. యువత శిక్షణ ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ వృత్తులలో ఉచితంగా శిక్షణ ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఫీజులు వసూలు చేయడమేమిటని ప్రశిస్తున్నారు. పైగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఆయా కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ పొందగోరే వారికి ఉచిత బస, భోజన వసతులు లేవు. యువత ఈ వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం వైపు కన్నెత్తి చూడకపోవడానికి ఇది కూడా ఒక కారణం. ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల ఆధ్వర్యంలోని శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేవారికి ఈ సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువత కోసం ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాల్లోనూ ఈ వెసులుబాట్లు ఉన్నాయి. కానీ ఇక్కడే లేకపోవడంతో దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క హనుమకొండలోనే ఈ కేంద్రం ఉంది.

ఆధునీకరించాలి

వృత్తిశిక్షణ కేంద్రానికి గతంలో ఇచ్చినన్ని నిధులు ఇవ్వడం లేదు. కేంద్రంలోని ఉద్యోగులకు వేతనాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. మార్కెట్‌లో ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. యువత తమ కాళ్లమీద తాము నిలబడేలా స్వయం ఉపాధిలో యువత శిక్షణ తీసుకొనేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం లేదు. ప్రోత్సాహకాలను అందించడం లేదు. గతంలో యువజన సర్వీసు శాఖలో ఉన్నప్పటి పథకాలను, రాయితీలను, ప్రోత్సాహకాలను పునరుద్ధరిస్తే దీనికి పూర్వవైభవం వస్తుందని నిరుద్యోగ యువతీ యువకులు అభిప్రాయపడుతున్నారు.

యువత ముందుకు రావడం లేదు..
అశోక్, డీఎస్‌వో, శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి, హనుమకొండ



స్టెప్ ఆధ్వర్యంలోని వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రంలో కోర్సుల్లో శిక్షణ తీసుకోవడానికి యువతీ యువకులు అంతగా ఆసక్తి చూపడం లేదు. వారిని రప్పించేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నాం. కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు ఈ శిక్షణా కేంద్రంలోని వివిధ కోర్సుల గురించి తెలియచేస్తున్నాం. వీటిలో శిక్షణ పొందడం వల్ల స్వయం ఉపాధి కల్పనకు గల అవకాశాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. స్వల్పకాలిక కోర్సులే అయినందున శిక్షణ పొందడం వల్ల భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నాం. అయినా కూడా పెద్దగా ముందుకు రావడం లేదు. కేంద్రంలో ప్రస్తుతం టైలరింగ్, కంప్యూటర్‌లో శిక్షణ కొనసాగుతోంది. వీటికి మంచి ఆదరణ ఉంది. అంతకుముందు సెల్‌ఫోన్ రిపేరింగ్, ఏసీ రిపేరింగ్, ఎలక్ట్రిషియన్ వంటి కోర్సులను నిర్వహించాం. కానీ, ఎవరూ రాకపోవడంతో వాటిని మూసేశాం. విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇప్పటికైనా ఈ కేంద్రం సేవలను వినియోగించుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

'న్యాస్'లో అద్భుత ప్రతిభ

- అభ్యసన సామర్థ్యాలలో జనగామ జిల్లా టాప్
- దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహణ
- 50 ఉత్తమ జిల్లాల్లో జనగామకు చోటు


కలెక్టర్‌తో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ అధికారులు (ఫైల్)

జనగామ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా గత డిసెంబరులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3, 6, 9 తరగతి విద్యార్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (నేషన్ అచీవ్‌మెంట్ సర్వే) న్యాస్-24 నిర్వహించగా ఫలితాలు ఈనెల 9న వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 50 జిల్లాలో జనగామకు చోటుదక్కడం విశేషం. న్యాస్‌పరీక్ష కోసం కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్యా శాఖ సహకారంతో నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు ఉపాధ్యాయులతో జిల్లాస్థాయి రిసోర్స్ గ్రూపును ఏర్పాటు చేశారు. ప్రశ్నల నిధి తయారుచేసి అన్ని పాఠశాలలకు అందజేసి 3, 6, 9 తరగతుల విద్యార్థులచే అభ్యాసం చేయించారు. ప్రతీ నెలా న్యాస్ ప్రిపరేషన్‌పై హెచ్‌ఎం లతో సమీక్ష నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో న్యాస్ ప్రశ్నలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మాదిరి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో ప్రత్యేకంగా మోడల్‌టెస్టులు నిర్వహించి చివరగా గ్రాండ్‌టెస్టు నిర్వహించి సన్నద్ధతను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.

జిల్లాలో 2,133 మందికి నిర్వహణ

జిల్లాలో 3వ తరగతిలో 33 పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులు, 6లో 27 పాఠశాలలకు చెందిన 688 మంది, 9లో 31 పాఠశాలలకు చెందిన 805 మందితో మొత్తం 91 పాఠశాలల నుంచి 2,133 మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. జనగామ జిల్లా జాతీయ స్థాయిలో 3వ తరగతికి సంబంధించి 16వ స్థానం, 6వ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతికి సంబంధించి 33వ స్థానంలో నిలిచింది. ప్రత్యేక కార్యాచరణ ఆసాంతం జనగామ డీఈవో దర్శనం భోజన్న నేతృత్వంలో జరిగింది. న్యాస్ పరీక్షపై ప్రత్యేక పీరియడ్ కేటాయించారు. ఎఫ్ఎ, ఎస్ఎలలో న్యాస్ ఆధారిత ప్రశ్నలు రూపొందించారు. మాదిరి ఓఎంఆర్ షీట్లపై ప్రాక్టీస్ చేయించి తప్పులను నిరోధించారు. తద్వారా జనగామ జిల్లా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది.

ఆలయాల అభివృద్ధితో పర్యాటక రంగం అభివృద్ధి

- మంత్రి కొండా సురేఖ


అమ్మవారి సన్నిధిలో మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం భద్రకాళి శాకంబరీ అలంకరణను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి పరుస్తుందని ఇందులో భాగంగానే బాసర సరస్వతి, వరంగల్ భద్రకాళి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, వేములవాడలోని రాజరాజేశ్వరాలయం, ఇతర ఆలయాలను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. తద్వారా అభివృద్ధితో పర్యాటకులు పెరిగి అన్ని రంగాల అభివృద్ధికి నాంది పలుకుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలుగా ప్రజలు దర్శించుకోవడంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలోనే భద్రకాళి మాడ వీధుల పనులు పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంత్రితో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, ఆలయ ధర్మకర్తలు, ఈవో, చైర్మన్, ఏఎస్పీ శుభం ప్రకాష్, సీఐలు గోపి, షకూర్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి.. అప్పుల భారం..

- అవస్థలు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- తీరిక లేని గ్రామ పంచాయతీ పనులు
- నిధులు విడుదల కాకపోవడంతో ఆవేదన
- శాఖకు సంబంధం లేని పనులు చేస్తున్న వైనం
- సర్పంచ్‌లు లేక తలకుమించిన భారం

నల్లబెల్లి/నెక్కొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పాలకవర్గాల కాలపరిమితి ముగియడంతో పరిపాలన భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. ఫిబ్రవరి 2024లో పాలక మండలి పదవీ కాలం ముగియడంతో నాటి నుంచి కార్యదర్శులే గ్రామాల్లో పరిపాలన సాగిస్తున్నారు. పంచాయతీల్లో నిధుల కొరత ఉండగా 18 నెలలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయడం లేదు. ప్రధానంగా బ్లీచింగ్ పౌడర్, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, చెత్త ట్రాక్టర్‌ల రవాణాకు సంబంధించిన డీజిల్, తదితర అత్యవసర ఖర్చులు కార్యదర్శులు సొంతంగా భరించాల్సి వస్తోంది. పరిపాలనకు నిధులు ఖర్చు అవుతున్నప్పటికీ అభివృద్ధి నిధులను మాత్రం మంజూరు చేయడం లేదు. దీంతో గ్రామ పంచాయతీల్లో అత్యవసరమైన పనుల కోసం కార్యదర్శులు అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

మానసిక ఒత్తిడి

గ్రామ పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడిని తట్టుకోలేక తీవ్రమైన అవస్థలకు గురవుతున్నారు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధంలేని పనులు కూడా చేయడంతో పని భారం మరింత పెరిగి మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక, సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి మరిన్ని కష్టాలు ఎక్కువైనట్లు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే ప్రతీరోజు జీపీ ఆవరణలో ఉండి ముఖ చిత్రంతో సెల్‌ఫోన్ ద్వారా హాజరు వేసుకోవాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఏ సమస్య వచ్చినా ముందుగా కార్యదర్శులు డబ్బులు పెట్టి పనిచేయించాల్సి ఉంటుంది. ఆయా బిల్లులు ఆలస్యంగా రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బిల్లులు రాక 18 నెలలకు పైగా అవుతోంది. దీంతో జీపీల్లోని ప్రజా సమస్యలను తీర్చడంలో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో మానసిక ఒత్తిడికి గురైతున్నట్లు వెల్లడిస్తున్నారు.

శాఖేతర పనులు

పంచాయతీ కార్యదర్శులు పని ప్రధానంగా రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవడం, గ్రామసభలను విజయవంతం చేయడం, శానిటైజేషన్ చేయడం, వీధి లైట్‌లను సరిచూడడం, ప్రజలకు తాగునీరును అందిచడం, బర్త్, డెత్ సర్టిఫికెట్‌లు అందించడం లాంటివి ప్రధానంగా చేస్తారు. కానీ, ఇవికాకుండా డిపార్ట్‌మెంట్‌కు సంబంధంలేని పని భారాన్ని పంచాయతీ కార్యదర్శులు కుల గణనను చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముగ్గులు పోయడం, రాజీవ్ యువ వికాసం దరాఖాస్తులు తీసుకొని, గ్రామ సభలు నిర్వహించడం, రేషన్ కార్డుల సర్వే లాంటి ఎన్నో పనులను పంచాయతీ కార్యదర్శులు చేస్తున్నారు. దీంతో జీపీల్లో అదనపు పని భారం ఏర్పడి తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నిధులు విడుదల చేయాలి..
గుగులోత్ యాకూబ్‌నాయక్, ఏనుగల్లు జీపీ కార్యదర్శి



అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశాం. డీపీవో, జిల్లా కలెక్టర్‌కు, పంచాయతీ అధికారులకు తమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందించాం. నిధులు విడుదల చేసి కార్యదర్శులను ఆదుకోవాలి.

సర్పంచ్‌లు లేక..

గ్రామ పంచాయతీ వ్యవస్థలో ప్రస్తుతం సర్పంచులు లేక ఆర్థిక భారం పడుతోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సర్పంచ్‌లు ప్రజలకు తాగునీరు అందించండంలో పైపు లైన్ వ్యవస్థని బాగుచేయడం, చెత్తసేకరణతో గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంచడం, వీధిలైట్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం లాంటివి చేస్తారు. ప్రస్తుతం సర్పంచ్‌లు లేక ఆర్థిక భారం తమపైనే పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న బదిలీల భయం

జీపీల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేస్తున్న కార్యదర్శులకు.. తాజాగా బదిలీల భయం వెంటాడుతోంది. జిల్లాలోని కొందరు శాసనసభ్యులు జిల్లా వ్యాప్తంగా కార్యదర్శుల బదిలీలు చేపట్టాలంటూ ఇటీవలనే సంబంధిత మంత్రి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ సమయంలో తాము బదిలీ అయితే తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు.



తొర్రూరు పట్టణంలోని సాయిబాబా హారతిలో పాల్గొన్న భక్తులు, మహిళలు



మహబూబాబాద్‌లోని ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న భారత్ వికాస్ పరిషత్ బాధ్యులు



మహబూబాబాద్‌లోని బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలో పూజలు చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ ఉమ

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

● సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ఆషాఢశుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీసాయి మందిర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 6 గంటలకు కాగడ హారతి, 6.45 గంటలకు అభిషేకం, అలంకరణ, అర్చన, 10 గంటలకు భజన, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 12.30 గంటలకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సతీమణి, మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ భూక్య ఉమ, కాంగ్రెస్ నాయకులు నీరుటి సురేష్‌నాయుడు, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, బోనగిరి గిరిధర్, పద్మం ప్రవీణ్, శ్రీసాయి మందిర సేవా ట్రస్టు అధ్యక్షుడు వందనం కమల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి యిమ్మడి చంద్రప్రకాశ్, కోశాధికారి బొడ్ల రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు రంగావఝ్ఝుల సుధాకరశాస్త్రీ వేదమంత్రోచ్చరణల నడుమ పార్వతిదేవికి పాలు, పంచాదార, నెయ్యి, పెరుగు, చెరుకు రసం, కొబ్బరి నీళ్ళు, గంధం, విభూతి, పసుపు, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. శాకంబరీ అమ్మవారికి పట్టువస్త్రం, వివిధ రకాల కూరగాయలతో ఏర్పాటు చేసిన దండలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టా శ్రీకాంత్‌శాస్త్రీ, భక్తులు పాల్గొన్నారు.

● మానుకోటలోని ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులను గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భారత్ వికాస్ పరిషత్ బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, నాగేందర్. ఆవుల శ్రీనివాస్, గణేష్, కృష్ణ, లెనిన్‌బాబు, పున్నమి, చంద్‌మల్చాని, నాగరాజు, రామకృష్ణ, జయప్రకాష్ లోయా పాల్గొన్నారు.

● తొర్రూరు : ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు పట్టణంలోని పాటిమీదగల సాయిబాబా ఆలయంలో ఆలయ అర్చకుడు శివశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే బాబాకు అర్చన, అభిషేకం, హారతి, ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం భక్తులు 1000 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం కాగడ హారతి, పట్టణంలోని పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు చేపట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తమ్మెర శారద లక్ష్మీనర్సింహారావు, మణి, బోనగిరి శంకర్, చింతల సురేష్, నాగేశ్వర్ రావు భక్తులు ఉన్నారు.

● బయ్యారం : గంధంపల్లి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిపారు.

● డోర్నకల్ : డోర్నకల్‌లో స్థానిక షిరిడిస్థాయి ధ్యానమందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై నారీకేళాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహన కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● గార్ల : స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు రాజకీయాల పట్ల అవగాహన పెంచుకోవాలని పీఏసీఎస్ చైర్మన్, విశ్వశాంతి విద్యాలయం కరస్పాడెంటెంట్ వడ్లమూడి దుర్గాప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, పాధ్యాయులు, మునీర్, శ్రీను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కురవి : కురవిలోని శ్రీసత్యసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బుక్క వీరన్న, మధు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీహెచ్.శ్రీనివాస్, గండెపల్లి తిరుమలరావు, కోనేటి వీరన్న, వేమిశెట్టి సంతోష్, బత్తిని నర్సయ్య పాల్గొన్నారు.

● మరిపెడ : మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను అర్చకులు, నిర్వాహకులు, భక్తులు నిర్వహించారు. కాగడ హారతితో గురు పౌర్ణమి వేడుకలను అర్చకుడు రవీంద్రాచారి ప్రారంభించారు. బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభి షేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదములను పంపిణీ చేశారు. ఆ ఆలయ మినీఏసీ ఫంక్షన్ హాల్‌ను ఆలయ వ్యవస్థాపకుడు వీరరాఘవులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ధర్మకర్త వెం పటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గూడూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ సాధన కమిటీ సమన్వయకర్త మేరెడ్డి సురేందర్

గూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిలిమిటేషన్, రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా గూడూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సాధన కమిటీ సమన్వయకర్త మేరెడ్డి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో గురువారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్‌లోనే గూడూరుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గతంలో పరిపాలన సౌలభ్యం కోసం గూడూరును సమితిగా, తాలూకగా ఏర్పాటు చేసి ఇక్కడి నుంచే పరిపాలన అందించారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫారెస్టు, డివిజన్, పోలీస్ సర్కిల్, ఇరిగేషన్ డివిజన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్, ఐటీడీఏ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యాలయాలు ఉన్నాయని చెప్పారు. గూడూరుకు అన్ని రకాల వసతులు, వనరులు ఉన్నాయని, వెంటనే నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఏర్పాటు కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, పారిశ్రామిక వేత్తలు, కుల, ప్రజా సంఘాల నాయకులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, ఎంసీపీఐ (యూ), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, బీజేపీ నాయకులు జలగం సంపత్‌రావు, నూకల ఉపేందర్, కటార్‌సింగ్, పెనక రాంమ్మూర్తి, జోగ రణధీర్, గుండెబోయిన మల్లేష్, ముత్యం సురేష్, భాస్కర్‌నాయక్, చెల్పూరి శ్రీశైలం, భావ్‌సింగ్, హుస్సేన్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రాఘవరావు

తొర్రూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతీ కార్యకర్త సమాయత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి ఎర్రబెల్లి రాఘవరావు అన్నారు. గురువారం తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు, రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అందిస్తుందన్నారు. ప్రతీ పేదవాడికి నేరుగా సంక్షేమ ఫలాలు అందించాలంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ యాకూబ్, మూల ఉపాకర్ రెడ్డి, నీరటి వెంకటసాయిలు, ధీకొండ ప్రభాకర్, మంచే వెంకటమ్మ, మంద నరేందర్, వెంకటరెడ్డి, రమణ పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అర్జున్‌రెడ్డికి ఘన సన్మానం



సీనియర్ వైద్యుడు అర్జున్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ప్రముఖ వైద్యుడు ఎం.అర్జున్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏటా గురు పౌర్ణమి రోజున శిష్యులు తమ గురువులను పూజించి, సత్కరించి వారి ఆశీస్సులు పొందుతారు. తమ జీవితాలకు మార్గనిర్దేశం చేసి సన్మార్గం వైపు నడిపించిన గురువులను సత్కరించి ఆశీస్సులు తీసుకుంటారు. అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది వైద్యులకు మార్గనిర్దేశం చేసి గురువుగా నిలిచిన సీనియర్ వైద్యులు అర్జున్‌రెడ్డిని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున తమకు గురువుతో సమానమైన అర్జున్‌రెడ్డిని సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, లయన్స్ బాధ్యులు అనుమాల వెంకటేశ్వర్లు, పమ్మి సనాతనచారి, వైద్యులు బోనగిరి అనిల్‌గుప్తా, చాపల రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

● సత్యవతి రాథోడ్ జిల్లాకు ఏమి చేశారో చెప్పాలి?

● కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు

మహబూబాబాద్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మానుకోట నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను విమర్శించే నైతికహక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంతన్ మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో సత్యవతిరాథోడ్ జిల్లా అభివృద్ధి కోసం ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎక్కడా లేని విధంగా మానుకోట నియోజకవర్గానికి రూ. 400 కోట్ల నిధులు తీసుకువచ్చి డిప్యూటీ సీఎం, ఐదుగురు మంత్రుల చేత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయించిన ఘనత ఎమ్మెల్యే మురళీనాయక్‌దని చెప్పారు. గూడూరు మండలంలో రూ.200 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిందని దానికి కూడా త్వరలో శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి జరుగుతున్న బీఆర్ఎస్ నేతలకు కన్పించడం లేదా అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు నారోజు సత్యమనోరమ, కమ్మగాని కృష్ణమూర్తి, నారాయణసింగ్, సిరిపురం వీరన్న, గుగులోతు రాములు నాయక్, బానోత్ హరిసింగ్, లకావత్ పద్మ, మల్లెష్, భూక్య లక్ష్మి, మాధవి, రాము పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన కోరెం



బయ్యారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరెం కనకయ్య

బయ్యారం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఇల్లందు ఎమ్మెల్యే కోరెం కనకయ్య గురువారం ప్రారంభించారు. సింగారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాగా, తమ తండాకు ఒక్కఇల్లు రాలేదని ఎమ్మెల్యేను తీత్రితండా వాసులు అడ్డుకున్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏవో రాంజీ నాయక్, హౌసింగ్ ఏఈ ప్రియాంక, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

డోర్నకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. గురువారం వెన్నారంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వంటనూనెల ఉత్పత్తి ఘణనీయంగా తగ్గడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో ఏటా రూ.లక్ష కోట్లు వంటనూనె కోసం విదేశాలకు చెల్లించాల్సి వస్తుందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, సాగు చేసిన రైతులకు రాయితీ, మార్కెటింగ్‌లు కల్పిస్తున్నట్లు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ డోర్నకల్ మునిసిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నర్సింహులపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కూడా పాత ప్రభుత్వ విధానాలను అవలంబిస్తుందని, నియోజకవర్గానికి రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పడమే తప్ప, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఒకే తరగతిలో అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు బోధించే కామన్ స్కూల్ విధానాన్ని తేవాలన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారం చేయకుండా కాంగ్రెసు ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లు అయినా ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటివరకు ఉన్న అన్ని పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, జిల్లా కౌన్సిలర్ వేణుగోపాల్, బొమ్మ శ్రీనివాస్, వెంకన్న, మోహన్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను నిర్వహించాలి

నెల్లికుదురు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో రవిరాథోడ్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని అయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శారద, ఆశర్కర్లు పాల్గొన్నారు

రాజాను కలిసిన మానుకోట నేతలు

మహబూబాబాద్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్, జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి కలుసుకున్నారు. హైదరాబాద్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ముగ్దుంభవన్ పునఃనిర్మాణం చేసుకుని గురువారం ప్రారంభించుకున్న సందర్భంగా హాజరైన ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాను మానుకోట జిల్లా నేతలు కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. మానుకోట జిల్లాలో ప్రజా, కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పోరాటాలను వారు వివరించారు.

‘ఆత్మీయ భరోసా’ అందేనా..?!

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులను ఎంపిక చేశారు. తొలివిడత ఉమ్మడి జిల్లాలోని 74 మండలాల నుంచి ఒక్కొక్క గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 2,581 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి తొలివిడత ఆత్మీయ భరోసా సాయం రూ.6వేల చొప్పున రూ.15.48కోట్లను నిరుపేదల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 64,555మందికి ఆత్మీయ భరోసా పథకం ద్వారా రూ.38.73కోట్ల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో లబ్ధిదారులకు తొలివిడత సాయం అందించి ఆరు నెలలు కావొస్తోంది. దీంతో మిగతా లబ్ధిదారులు తమకు ఎప్పుడు ఆత్మీయ భరోసా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు తొలివిడత రూ.6వేల సాయాన్ని పొందిన లబ్ధిదారులకు కూడా రెండో విడత సాయాన్ని ఈ నెలఖారులోగా జమ చేయాల్సి ఉంది. అయితే మిగతా లబ్ధిదారులకు తొలి విడత సాయమే అందించలేదని, రెండో విడత తమకు వస్తుందా లేదా అనే ఆందోళన ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతే ఉండటంతో ఇందిరమ్మ ఆత్మీయ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

లబ్ధిదారుల ఎంపికపై..

ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ కూలీలతో పాటు పట్టణ ప్రాంత పేదలకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలనే డిమాండ్ ఉంది. వీటితో పాటు లక్షల్లో కూలీలు ఉంటే 10శాతం కూడా లబ్ధిదారులను ఎంపిక చేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు మహబూబాబాద్ జిల్లాలో 2,19,509 జాబ్‌కార్డులు ఉంటే 4,61,007మంది కూలీలు ఉన్నారు. వీరిలో కేవలం 21,673మందిని మాత్రమే ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. 5శాతం కూడా పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనిదినాలను కాకుండా 2023-24 ఆర్థిక సంవత్సరం పని దినాలను పరిగణంలోకి తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులనే ఫైనల్ చేసి భరోసా నిధులు విడుదల చేస్తుందా..? లేదా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఏమైనా అవకాశం ఇస్తుందా..? అనే ఆశతో నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ భరోసా పథకం అమలుపై ఎలాంటి ప్రకటన రాకపోవటంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని అమలు చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్

కేసముద్రం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, ఉద్యోగులకు రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్న పేరివిజన్ కమిషన్(పీఆర్‌సీ)ని 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలో గురువారం కేసముద్రం స్టేషన్, విలేజి, కల్వల, తాళ్లపూసపల్లి జడ్పీ ఉన్నత, కల్వల ఆదర్శ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఎఫ్ ఉపసంహరణలను చెల్లించకపోవడం బాధకరమని అన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి వెంకట్రాంనర్సయ్య, మండల అధ్యక్షుడు గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, అంజయ్య, కొమ్ము రాజేందర్, బి.విజయ్‌చందర్, జి.మోహనకృష్ణ, బబ్బురి సురేష్, పి.రామారావు పాల్గొన్నారు.

విగ్రహాలు ఏర్పాటు చేయాలి

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భారతి

మహబూబాబాద్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ముఖ్యప్రాంతాల్లో చారిత్రక, జాతీయ, ప్రజా నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధికార ప్రతినిధి దారా ఇందుభారతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ, మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్‌కు గురువారం వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇందుభారతి మాట్లాడుతూ... పట్టణంలోని మూడుకొట్ల సెంటర్ వద్ద చత్రపతి శివాజీమహారాజ్, తహసీల్ధార్ కార్యాలయం వద్ద జవాన్, నర్సంపేట బైపాస్‌రోడ్ వద్ద రాణి రుద్రమ దేవి, ఇల్లందు బైపాస్‌లోని వ్యవసాయ మార్కెట్ వద్ద రైతుల విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ విగ్రహాలు ప్రజల్లో దేశభక్తిని, చరిత్రపట్ల గౌరవాన్ని, రైతుల పట్ల కృతజ్ఞత భావాన్ని కలిగించడమే కాకుండా పట్టణాభివృద్ధిలో సాంస్కృతికంగా నిలిచే సూచికగా మారుతాయని ఆశిస్తున్నామన్నారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన స్థలం, అనుమతులు, మునిసిపల్ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, ప్రేమ్‌సాగర్, భద్రి పాల్గొన్నారు.

రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలి

● మండల పార్టీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

మరిపెడ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతాంగానికి అధిక లాభాలున్నాయని ఏవో వీరాసింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లీ రఘువీరారెడ్డి అన్నారు. గురువారం మండలంలోనే గుండెపుడికి చెందిన శ్రీరాం తారకం కుమారుడు శ్రీనివాస్‌కు చెందిన 5 ఎకరాల భూమిలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పంపిణీ చేసిన 300 ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, రైతు శ్రీరాం శ్రీనివాస్, పీఎంవో అఖిల్, జైన్ కంపెనీ ప్రతినిధి పాల్వాయి ఎల్లయ్య, ఏఈవోలు అరవింద్, శ్వేత, శృతి, సైదమ్మ, బొడపట్ల సుధాకర్, కుడితి వెంకటరెడ్డి, సూరబోయిన ఉప్పలయ్య పాల్గొన్నారు.

చిన్నగూడూరు తహసీల్దార్‌గా సంపత్

చిన్నగూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల నూతన తహసీల్దార్‌గా గురువారం ఎస్.సంపత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో విధులు నిర్వహిస్తూ బదిలీపై చిన్నగూడూరుకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌అలీ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంపత్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రెవిన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై కళాకారుల ప్రదర్శన

డోర్నకల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై గురువారం డోర్నకల్ రైల్వేసెంటర్‌లో కళాకారులు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ నియనిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులు తమ ఇళ్లను నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోందని అవగాహన కల్పించారు.

ఘనంగా మత్స్యకృషివలుల దినోత్సవం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గురువారం జాతీయ మత్స్య కృషివలుల దినోత్సవాన్ని మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న మాట్లాడుతూ.. చెరువులో చేపలు వదలడమే కాదు.. వాటిని పెంపకంలో కూడ మెళకువలు తెలుసుకుని మత్స్యసంపదను పెంచుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గొడుగు శ్రీనివాస్‌ముదిరాజ్, జిల్లా మత్స్యపారిశ్రామిక సంఘాల చీఫ్ ప్రమోటర్ రమేష్‌ముదిరాజ్, సొసైటీ అధ్యక్షులు పెద్ది సైదులు, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు మైన నాగయ్య, దశరథం, పిచ్చయ్య, వెంకన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి



ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న తొర్రూరు మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్

తొర్రూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతోనే రైతులకు అధిక లాభాలు లభిస్తున్నాయని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళాలో భాగంగా గురువారం మండలంలోని ఫత్తేపురం గ్రామంలో నాయిని శ్రీపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటి ప్రారంభించారు. తొర్రూరు తహసీల్దార్ శ్రీనివాస్, ఉద్యానవనశాఖ అధికారి మానస, వ్యవసాయ శాఖ అధికారి రామనర్సయ్య, కాంగ్రెస్ నాయకులు రామసహాయం కిషోర్ రెడ్డి, మేరుగు మల్లేశం గౌడ్, నరేందర్ రెడ్డి, గ్రామ రైతులు ఇట్టె ప్రభాకర్ రెడ్డి, మల్లారెడ్డి, ప్రతాప్ రెడ్డి, అశోక్, నాగిరెడ్డి, బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని మోసం

● కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి

చిన్నగూడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తే కొంత మొత్తం డబ్బు ఖర్చు అవుతుందని చెప్పి, పాత ఇంటి పిల్లర్లు కూల్చించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుడు నాగేష్ మోసం చేశాడని చిన్నగూడూరుకు చెందిన దళిత దంపతులు కంచనపల్లి నాగన్న-కరుణ ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. దివ్యాంగుడైన కంచనపల్లి నాగన్న-కరుణ దంపతులు బతుకు దేరువుకోసం హైదరాబాద్‌కు వెళ్లారు. చిన్నగూడూరుకు చెందిన ముగ్గురు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామంటే తిరిగి వారు గ్రామానికి వచ్చారు. ఇల్లు ఇప్పించేందుకు రూ.50 వేలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇవ్వకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు తీసేశారు. కరుణ తన భర్త దివ్యాంగుడని, పిల్లలు ఏలా బతకాలని నాయకులు అడిగితే కులం పేరుతో దూషించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. కాగా, కాంగ్రెస్ నాయకుడిపై దళితుల దేహశుద్ధి చేశారని అని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరలైంది.